
సాక్షి
బాపట్ల
గురువారం । 2 । మే । 2024



206మందికి వైద్యపరీక్షలు

ఫిరంగిపురం: రేపూడిలో ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యాన బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. 206 మందికి వైద్యురాలు శ్వేత పరీక్షలు చేసి మందులు అందజేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 505 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది.



వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: గుంటూరు పండరీపురంలోని కోదండరామ మందిరంలో వేంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం మొదలయ్యాయి.

న్యూస్‌రీల్

తీరంలో ఇద్దరిని కాపాడిన పోలీసులు, గజ ఈతగాళ్లు

సిబ్బందిని అభినందించిన ఎస్పీ వకుల్ జిందాల్



బాపట్ల టౌన్: సముద్రంలో స్నానాలు చేస్తుండగా అలల తాకిడికి కొట్టుకుపోతున్న ఇద్దరిని గజ ఈతగాళ్లు కాపాడిన ఘటన బుధవారం సూర్యలంక తీరంలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మంగళగిరి పట్టణానికి చెందిన వేశం భాను ప్రకాష్, గాలి కిరణ్‌బాబు స్నేహితులతో కలిసి సూర్యలంక సముద్రతీరానికి విహారయాత్రకు వచ్చారు. వీరంతా సముద్రంలో స్నానాలు చేస్తుండగా ఒక్కసారిగా వచ్చిన అలల తాకిడికి ఇద్దరు సముద్రంలో కొట్టుకుపోసాగారు. స్నేహితులు కేకలు వేయడంతో తీరంలో విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది, గజ ఈతగాళ్లు తక్షణమే స్పందించి మునిగిపోతున్న వారిని రక్షించి, ఒడ్డుకు చేర్చారు. ప్రథమ చికిత్స చేశారు. ఇద్దరు యువకుల ప్రాణాల్ని రక్షించిన కానిస్టేబుల్ ఎస్.నాగరాజు, హోంగార్డులు ఎస్.నరసింహమూర్తి, శ్రీనివాసరావు, నాగరాజు, గజ ఈతగాళ్లు సత్యనారాయణ, నాగేశ్వరరావు, ఆంజనేయులు, శివ కోటేశ్వరరావును యాత్రికులతో పాటు, ఎస్పీ వకుల్ జిందాల్ ప్రత్యేకంగా అభినందించారు.

ఎన్నికల నిబంధనలు పాటించడం తప్పనిసరి



వేమూరు: పోటీలో ఉన్న అభ్యర్థులంతా ఎన్నికల కమిషన్ నిబంధనల్ని తప్పక పాటించాలని పరిశీలకులు పరిమళ్ సింగ్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల ప్రతినిధులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భట్టిప్రోలు మండలంలోని విశ్వశాంతి పాఠశాల్లో స్ట్రాంగ్ రూం ఏర్పాటు చేశామని తెలిపారు. పార్టీ అభ్యర్థులంతా గురువారం ఉదయం 8 గంటలకు అక్కడకు వస్తే ఈవీఎం మిషన్లు తనిఖీ చేస్తామని పేర్కొన్నారు. ప్రతి అభ్యర్థికీ ఇద్దరు ఎన్నికల ఏజెంట్లను ఏర్పాటు చేస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో నియోజకవర్గం రిటర్నింగ్ అధికారి వసంతరాయుడు, తహసీల్దార్ జె. కిరణ్, పార్టీ అభ్యర్థులు ప్రతినిధులు దూరు భాగ్యారావు, జడ రవీంద్ర, యల్లమాటి శ్యాం ప్రసాద్ పాల్గొన్నారు.

రేపు క్రోసూరుకు సీఎం వైఎస్ జగన్



క్రోసూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్రవారం పెదకూరపాడు నియోజకవర్గం పరిధిలోని క్రోసూరు రానున్నారు. సీఎం పర్యటన బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ బిందు మాధవ్ బుధవారం పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మధ్యాహ్నం 1.30 గంటలకు క్రోసూరులో జరిగే మేమంతా సిద్ధం సభలో ప్రసంగిస్తారు. ఈ నేపథ్యంలో ఎస్పీ బిందుమాధవ్ క్రోసూరు వచ్చి హెలిపాడ్ గ్రౌండ్‌ను, సభ జరిగే ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించాలని అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్పీతోపాటు సత్తెనపల్లి డీఎస్పీ జీసీ గురునాథ బాబు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ ప్రభాకర్, పెదకూరపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మంగారావు, క్రోసూరు ఎస్ఐ మహమ్మద్ షఫీ పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రోసూరు పర్యటన ఏర్పాట్లను పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం పరిశీలించారు. హెలీప్యాడ్, సభా స్థలం, వాహనాల పార్కింగ్ అంశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. నియోజకవర్గం నలుమూలల నుంచి సభకు భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.5500, గరిష్ట ధర రూ.7800, మోడల్ ధర రూ.6500 వరకు పలికింది.





బాపట్ల జిల్లాలో ప్రధాన పంటలు



హలధారీ సుఖీభవ !

- ఆర్‌బీకేల ఏర్పాటుతో రైతులకు చేదోడువాదోడు
- విత్తనాలు మొదలు ధాన్యం విక్రయం వరకు తోడుగా సిబ్బంది
- రైతుభరోసా కింద రూ. 3515 కోట్లు జమ
- ఇన్‌ఫుట్ సబ్సిడీ కింద రూ. 117.56 కోట్లు
- యంత్రసేవా పథకం ద్వారా రూ. 12.38 కోట్ల యంత్రాల పంపిణీ
- రూ. 24.90 కోట్ల సున్నా వడ్డీ రుణాలు
- రూ. 174.18 కోట్ల క్రాఫ్ ఇన్సూరెన్స్
- తాజాగా రైతుభరోసా రూ. 16 వేలకు పెంచుతూ మేనిఫెస్టోలో ప్రకటన
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు

సీఎం జగన్ పాలనలో వ్యవసాయం పండుగ

బాపట్ల టౌన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతు రాజుగా బతికాడు. ఆయన ఇచ్చిన ధీమాతో, ఉచిత బీమాతో సాగు లాభసాటిగా మారింది. వ్యవసాయం దండగంటూ చంద్రబాబు రైతుల్ని ఈసడిస్తే, జగనన్న సుఖీభవా అంటూ దీవించారు. పంట సాయం దగ్గర నుంచి గిట్టుబాటు ధరల వరకు అండదండగా నిలిచారు. విత్తనంపై బడా కంపెనీల పెత్తనానికి అడ్డుకట్ట వేస్తూ రైతు భరోసా కేంద్రాల ద్వారా స్నేహహస్తాన్ని అందించారు. వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ పథకంతో ఆర్థికంగా బలోపేతం చేశారు. తాజాగా ప్రకటించిన మేనిఫెస్టోలో రూ. 13,500 గా ఉన్న సాయాన్ని రూ. 16 వేలకు పెంచుతున్నట్లు సీఎం జగన్ ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

రైతులకు అడుగడుగునా అండగా...

జిల్లాలో గతంలో ఎన్నడూలేని విధంగా వైఎస్సార్ సీపీ పాలనలో ప్రతి గ్రామంలో రూ. 21.80 లక్షలతో రైతుభరోసా కేంద్రాన్ని నిర్మించారు. ఇప్పటికే రూ. 32.26 కోట్లతో 148 కేంద్రాల్ని ప్రారంభించారు. వీటిల్లో రైతు సహాయకుల్ని నియమించారు. రైతులు సాగుచేసిన పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేయడం, ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు రైతుల్ని వెంటనే ఆదుకోవడం, ఇన్‌ఫుట్ సబ్సిడీ, యాంత్రీకరణ పరికరాలు పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది జగనన్న ప్రభుత్వం.

ఐదేళ్లలో రూ. 3844.26 కోట్లు అందజేత

రైతులకు ప్రభుత్వం సకాలంలో ఎరువులు, విత్తనాలు అందించడంతోపాటు పంటలకు గిట్టుబాటు ధర కల్పించింది. మార్కెట్‌లో ధర తక్కువగా ఉన్నప్పుడు ప్రభుత్వమే కొనుగోలు చేసి ఖాతాల్లో నేరుగా నగదు జమ చేసింది. రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్, రైతుభరోసా, ఇన్‌ఫుట్ సబ్సిడీలాంటి పథకాలతో ఏకంగా గడిచిన ఐదేళ్లలో రూ. 3844.26 కోట్లను అందజేసింది. ఇందులో యంత్రసేవా పథకం ద్వారా 402 సీహెచ్‌సీఎస్ గ్రూపులకు గానూ 266 యంత్రాలను రూ. 12.38 కోట్లతో పంపిణీ చేసింది. సున్నావడ్డీ పథకం రూపంలో 1,26,869 మంది రైతులకు గానూ రూ. 24.90 కోట్లు అందించింది.

చేతల నాయకుడు సీఎం జగన్



మాట తప్పని...మడమ తిప్పని ఏకైక నాయకుడు సీఎం జగన్. గతంలో చాలా మంది ముఖ్యమంత్రులను చూశాం. అధికారంలోకి రాకముందు ఏవో నోటికొచ్చినట్లు వాగ్దానాలు చేయడం, వచ్చిన తర్వాత వాటి గురించి పట్టించుకోవడమే మానేసేవారిని చూశాం. వ్యవసాయాన్ని పండుగ చేసిన ఏకైక నాయకుడు జగన్. మాకు అన్నిరకాలుగా అండగా నిలిచి మమ్మల్ని ప్రోత్సహించిన ఘనత ఆయనకే దక్కుతుంది.

– ఆవుల వెంకటేశ్వర్లు, కొత్తమద్దిబోయినవారిపాలెం

అప్పుల బాధలు తొలగాయి



గతంలో వ్యవసాయం చేయాలంటే సాగు ప్రారంభానికి ముందే ప్రైవేటు వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు నగదు అప్పు తెచ్చుకోవాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. జగనన్న రైతుభరోసా పథకం ద్వారా మాకు అండగా నిలిచారు. సొమ్మును మూడు దఫాలుగా నేరుగా మా అకౌంట్‌లోనే జమ చేస్తున్నారు. పండించిన పంటలకు కూడా సరైన గిట్టుబాటు ధర కల్పించారు. ప్రస్తుతం చాలా ఆనందంగా వ్యవసాయం చేసుకుంటున్నాం.

– కంచకర్ల ఆగస్టీన్, చింతావారిపాలెం

ఇన్‌ఫుట్ సబ్సిడీ ఇలా..

నియోజకవర్గం	నష్టపోయిన రైతులు	దెబ్బతిన్న పొలాలు	నగదు (కోట్లల్లో)
అద్దంకి	5289	3483 హెక్టార్లు	రూ. 4.38
బాపట్ల	17795	12445	రూ.20.57
చీరాల	23	15	రూ. 0.2
పర్చూరు	11855	10147	రూ.12.24
రేపల్లె	44135	24554	రూ.40.27
వేమూరు	35522	24676	రూ.40.09
మొత్తం	114619	75319	రూ.117.56

రైతు భరోసా సాయం

నియోజకవర్గం	రైతులు	నగదు పంపిణీ (కోట్లల్లో)
అద్దంకి	47119	రూ. 871.93
చీరాల	6535	రూ. 121.20
పర్చూరు	43610	రూ.816.13
బాపట్ల	21947	రూ.399.58
వేమూరు	38025	రూ.681.44
రేపల్లె	34801	రూ.624.95
మొత్తం	192037	రూ.3515.24

క్రాప్ ఇన్సూరెన్స్

నియోజకవర్గం	రైతులు	నగదు పంపిణీ (కోట్లల్లో)
అద్దంకి	12,400	రూ. 57.03
చీరాల	297	రూ. 0.26
పర్చూరు	12,719	రూ.29.49
బాపట్ల	14,702	రూ.16.40
వేమూరు	29,027	రూ.38.58
రేపల్లె	22,975	రూ.32.38
మొత్తం	92,119	రూ.174.18

పారదర్శకంగా రెండో విడత ర్యాండమైజేషన్

- జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్‌బాషా
- ఆన్‌లైన్ ద్వారా ఓటింగ్ యంత్రాల కేటాయింపు



ర్యాండమైజేషన్‌ను పరిశీలిస్తున్న పరిశీలకులు పరిమళ సింగ్, ఖాజన్‌సింగ్, కలెక్టర్

బాపట్ల: పోలింగ్ కేంద్రాలకు అత్యంత పారదర్శకంగా ఓటింగ్ యంత్రాల్ని కేటాయించామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా పార్లమెంటు, అసెంబ్లీ నియోజకవర్గాలలో పోటీ చేస్తున్న అభ్యర్థులు, ఎన్నికల సాధారణ పరిశీలకులు పరిమళ సింగ్, ఖాజన్ సింగ్ సమక్షంలో బుధవారం రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్ నిర్వహించారు. బాపట్ల పార్లమెంటు పరిధిలోని 1,766 పోలింగ్ కేంద్రాలకు 2,166 బ్యాలెట్ యూనిట్లు, 2,166 కంట్రోల్ యూనిట్లు, 2,528 వీవీ ప్యాట్స్ యంత్రాల్ని కేటాయించారు. ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలోని పోలింగ్ కేంద్రాలకు ఆన్‌లైన్ ద్వారా ఆయా నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు చేపట్టిన ర్యాండమైజేషన్ ప్రక్రియను జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల పరిశీలకులు పర్యవేక్షించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేపట్టిన ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు పాల్గొన్నారు.

పోలింగ్ నిర్వహణలో అప్రమత్తత అవసరం

పర్చూరు (చినగంజాం): పోలింగ్ నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని బాపట్ల జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా సూచించారు. పర్చూరు నియోజకవర్గ పోలింగ్ అధికారులకు బుధవారం ఎస్ఎఫ్ఎస్ హైస్కూలులో రిటర్నింగ్ అధికారి, బాపట్ల రెవెన్యూ డివిజన్ అధికారి జి. రవీందర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ మాస్టర్ ట్రైనర్లు ఇచ్చే శిక్షణను జాగ్రత్తగా అనుసరించాలని ఆయన సూచించారు. ఈవీఎం, వీవీపీటీ, సీయూ, బీయూల పని విధానం, పోలింగ్ సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మాక్ పోలింగ్ నిర్వహించే విధానం గురించి వివరించారు.

బాబు హామీల చిట్టా.. అబద్ధాల పుట్ట

- చీరాల ప్రజాగళంలో ఊకదంపుడు ఉపన్యాసం
- మేనిఫెస్టోపై గొప్పలు
- అధికారంలోకి రాకుండానే వచ్చినట్లుగా బిల్డప్
- బాబు హామీలపై ప్రజల్లో వ్యతిరేకత



చంద్రబాబు సభకు అరకొరగా హాజరైన జనం

సాక్షి ప్రతినిధి, బాపట్ల: చీరాల్లో బుధవారం జరిగిన ప్రజాగళం సభలో చంద్రబాబు మాటలు కోటలు దాటాయి. తాను అధికారంలోకి వచ్చాననే బిల్డప్ ఇచ్చాడు. తమ మేనిఫెస్టో జనరంజకమని పదేపదే చెప్పుకోవడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మేనిఫెస్టో అంతా అతుకుల బొంత అని ఈసడించారు. 2014లో పలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత మేనిఫెస్టోనే మాయం చేసిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడాన్ని సభకు వచ్చిన జనం చర్చించుకోవడమే మరింత హాట్ టాపిక్‌గా మారింది. చంద్రబాబు హామీల్ని జనం నమ్మే పరిస్థితిలేదని, కొందరు ఆ పార్టీ కార్యకర్తలే వ్యాఖ్యానించడం గమనార్హం.

వెలవెలబోయిన సభ

సభకు జనం అంతంత మాత్రంగానే హాజరయ్యారు. షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 3.10 గంటలకు జరగాలి. ఆ సమయానికి వందల మంది జనం కూడా సభా ప్రాంగణంలో కనిపించలేదు. చంద్రబాబు తీరిగ్గా 4.25 గంటలకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. కొత్తపేట బైపాస్ రోడ్డులోని టీడీపీ కార్యాలయం దగ్గర సభను ఏర్పాటు చేసినప్పటికీ జనం లేకపోవడంతో ఆయన మరికొద్ది సేపు బస్‌లోనే వేచిచూశారు. విసిగెత్తిపోయి 4.42 గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్నారు. అప్పటికి చిన్నపాటి ప్రాంగణం కూడా జనంతో నిండలేదు. సాయంత్రం 5.01 గంటలకు చంద్రబాబు తన ప్రసంగాన్ని ప్రారంభించి ప్రజల సహనానికి పరీక్ష పెట్టారు. ఆద్యంతం తన మేనిపెస్టోపై గొప్పలు చెప్పుకోవడంతో సరిపోయింది. వైఎస్. జగన్ మేనిఫెస్టోతో చేతులెత్తేశారని, తమది అద్భుతమంటూ భుజం చరుచుకున్నారు.

విసుగెత్తిన ప్రజలు

సభలో మేనిఫెస్టోలో అమలుకు వీలుకాని హామీల్ని చంద్రబాబు పదేపదే చదివి వినిపించడంపై జనం విసుగు చెందారు. చంద్రబాబు ఎన్ని హామీలు ఇచ్చినా నమ్మే పరిస్థితి లేదని, ఆయనకు ఓటేసే పరిస్థితి లేదని సాక్షాత్తు సభకు వచ్చిన ప్రజలు అనడం చర్చనీయాంశంగా మారింది. బాబు ప్రసంగం ప్రారంభం కాగానే జనం విసుగుచెంది వెనుదిరిగారు.

యువకుల వెక్కిరింపులు

నిరుద్యోగులకు నెలకు రూ.3వేలు చొప్పున భృతి ఇస్తామని బాబు చెప్పగా, సభలోని యువకులు గతంలో చెప్పిన హామీ ఇవ్వలేదుగా అంటూ కేకలు పెట్టారు. పొదుపు మహిళలకు గతంలో రుణమాఫీ హామీ ఇచ్చి అమలు చేయకపోయినా రుణమాఫీ చేశానని సభలో చెప్పడంతో మహిళలు నివ్వెరపోయారు. బాబు అబద్ధాలు చెప్పారంటూ కొందరు బహిరంగంగానే విమర్శలు గుప్పించారు. చేనేతలు అధికంగా ఉన్న చీరాల్లో టెక్స్‌టైల్ పార్కు పెడతానని గతంలో 2014లో సీఎం హోదాలో చేనేత దినోత్సవం రోజున హామీ ఇచ్చినప్పటికి ఇంతకీ అమలుకు నోచుకోలేదు. మళ్లీ అదే హామీని ఇవ్వడంతో నేత కార్మికులు విస్తుపోయారు. అధికారంలోకి వచ్చిన వెంటనే జగన్ అమరావతిని విధ్వంసం చేశాడని చంద్రబాబు విమర్శించగా.. అధికారంలో ఉన్న ఐదేళ్లలో నిర్మించకుండా గ్రాఫిక్స్‌తో సరిపెట్టలేదా ? అని పలువురు వ్యాఖ్యానించారు. పాఠశాలలకు రంగులు కొడితే చదువు వస్తుందా ? అని ఎగతాళిగా అనడంపై సభలో విమర్శలు వెల్లువెత్తాయి.

మండిపడిన సభికులు

సాగునీటి కాలువలు, తాగునీటి పథకాల్ని సీఎం జగన్ పట్టించుకోలేదంటూ చంద్రబాబు విమర్శించడం పైనా సభికులు మండిపడ్డారు. చంద్రబాబు పాలనలో పూర్తిగా విస్మరించిన విషయాన్ని పలువురు గుర్తు చేయడం కనిపించింది. ఇంటికో ఉద్యోగం ఇస్తానని చెప్పి నెరవేర్చకుండా కాలయాపన చేసి మళ్లీ మేనిఫెస్టోలో 20 లక్షల ఉద్యోగాలు అంటూ గొప్పలు చెప్పడంతో సభలో విమర్శలు వెల్లువెత్తాయి. నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకోవడం నీకు తగునా బాబు ! జనం వ్యాఖ్యానించడం కనిపించింది. చీరాల్లో ఐటీ టవర్ కడుతాను...బోర్ కొడితే ఇక్కడికే వచ్చి ఉద్యోగం చేసుకోవచ్చని చంద్రబాబు చెప్పడాన్ని అందరు వ్యంగంగా మాట్లాడుకోవడం కనిపించింది. చీరాల ఐటీ టవర్ కట్టడం ఏమిటో...బోర్ కొట్టినప్పుడు వచ్చి ఆటవిడుపుగా ఉద్యోగాలు చేసుకోవచ్చుని అనడం ఏమిటో.... అర్థం కాక చంద్రబాబు ప్రసంగంపై యువకులు చలోక్తులు విసరడం విశేషం.

ఇతర జిల్లాల నుంచి జనం తరలింపు

చంద్రబాబు సభకు బాపట్ల, ప్రకాశం జిల్లాతో పాటుగా ఇతర ప్రాంతాలకు చెందిన వారిని తరలించడం చర్చనీయాంశంగా మారింది. వాస్తవానికి ప్రజాగళం సభ చీరాల నియోజకవర్గానికి పరిమితం కావాల్సి ఉంది. అయితే, గతంలో బాపట్ల, పర్చూరు. వేమూరు, రేపల్లె సభలకు నామమాత్రంగా కూడా జనం హాజరుకాలేదు. దీంతో ఆ ప్రజాగళం సభలు పూర్తి ఫెయిల్ అయ్యాయి. చంద్రబాబు సభలకు జనం రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. సభలకు జనాన్ని తరలించలేదని జిల్లా నాయకులకు ఆయన చివాట్లు పెట్టినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో చీరాల్లో జరిగిన ప్రజాగళం సభకు జిల్లాలోని అన్నీ అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటుగా ప్రకాశం జిల్లా, గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి నాయకులు, కార్యకర్తలను తరలించారు. అయినప్పటికీ వెలవెల పోయింది.

సేవకు మరో అవకాశం ఇవ్వండి



చింతమోటులో ఎన్నికల ప్రచారంలో నందిగం సురేష్, అశోక్‌బాబు

- ఎమ్మెల్యే అభ్యర్థి అశోక్‌బాబుతో కలసి నందిగం సురేష్ ప్రచారం
- నియోజకవర్గంలో చురుగ్గా పర్యటన

భట్టిప్రోలు: సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడటంతో వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ప్రచారంలో జోరు పెంచారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఆయన విస్తృతంగా ప్రచారం సాగిస్తున్నారు. మండలంలోని చింతమోటు, కొత్త కాలనీ, పెదలంక, మధ్యగూడెం, పెసర్లంక, వెల్లటూరు, పెదపాలెం, పెదపులివర్రు గ్రామాల్లో బుధవారం వైఎస్సార్ సీపీ బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్, బౌడ చైర్మన్ దేవినేని మల్లికార్జునరావులతో కలిసి ప్రచారం చేశారు. గ్రామస్తులంతా పెద్దఎత్తున మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్ మాట్లాడుతూ సంక్షేమంతో పాటు పెద్దత్తున అభివృద్ధితో పాటు అర్హత కలిగిన వారికి ఇళ్ల స్థలాలు ఇచ్చామని తెలిపారు. ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి మరింత సేవ చేసే అవకాశం ఇవ్వాలని కోరారు. అశోక్‌బాబు మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, రాష్ట్ర ప్రగతి కోసం పాలన సాగించిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రి చేసుకోవాలని పిలుపునిచ్చారు. గత ఐదేళ్లల్లో జరిగిన అభివృద్ధి, మళ్లీ అధికారంలోకి వస్తే అమలు చేసే మేనిఫెస్టోను ఓటర్లకు వివరించారు. బౌడ చైర్మన్ దేవినేని మాట్లాడుతూ ప్రజలు టీడీపీ, జనసేన కూటమి కల్తీ రాజకీయాల్ని నమ్మే పరిస్థితిల్లో లేరన్నారు. రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. తొలుత నిర్వహించిన బైక్ ర్యాలీలో అశోక్‌బాబు పాల్గొన్నారు. దేవాలయాలు, చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు కొండా శివప్రసాదరెడ్డి , సర్పంచులు గుమ్మడి శంకరరావు, వేములపల్లి వెంకటేశ్వరరావు, నీలా ఉషా రాణి, మాజీ సర్పంచ్ చౌటూరి లక్ష్మి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీటీసీ సభ్యులు నన్నెపాముల చంటి, దారావత్ కుమారి బాయి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, పీఏసీఎస్ చైర్ పర్సన్ గోవర్ధనగిరి చినబుజ్జి, వైఎస్సార్ సీపీ నాయకులు డాక్టర్ చిలుమూరు రామమోహన్‌రావు, జల్లి జోషికాంత్, మోటూరి చంద్రశేఖరరావు, గుజ్జర్లమూడి రాజు, శొంఠి రాము, జయకృష్ణ, పడమట శ్రీనివాసరావు, శేరు శ్రీనివాసరావు, బొల్లెద్దు ప్రతాప్, జయవరపు రాధాకృష్ణమూర్తి, మోర్ల కోటేశ్వరరావు, నున్నం ఆనంద్ పాల్గొన్నారు.

ప్రచార పర్వం



భట్టిప్రోలు మండలం పెదపులివర్రు, కోళ్లపాలెం, గొరిగపూడి, దానరిపాలెం, ఓలేరు గ్రామాల్లో బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వేమూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరికూటి అశోక్‌బాబు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎన్నికల్లో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

– భట్టిప్రోలు



సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసి సీఎం కావాలని చంద్రబాబు భావిస్తున్నాడని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన గురువారం సంతమాగులూరు మండలంలోని కుందుర్రులో అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

–అద్దంకి



చంద్రబాబుది కిచిడీ మేనిఫెస్టో అని పర్చూరు వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ విమర్శించారు. బుధవారం మండలంలోని దేగరమూడి, జొన్నతాళి, చిమ్మిరిబండ గ్రామాల్లో ప్రచారం చేసిన ఆయనకు ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. చంద్రబాబు మరోసారి ప్రజలను మోసగించడానికి మేనిఫెస్టోతో వస్తున్నాడని.. నమ్మి ఓటు వేయవద్దని బాలాజీ తెలిపారు.

–మార్టూరు

క్లుప్తంగా

తోకవారిపాలెంలో టీడీపీకి నిరసన సెగ



గుంటూరు రూరల్: ప్రజలకు చేసిందేమి లేకపోయినా కల్లబొల్లి కబుర్లు చెబుతూ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు గ్రామాల్లోకి రావద్దని మండలంలోని తోకావారిపాలెం గ్రామ ప్రజలు టీడీపీ అభ్యర్థి రామాంజనేయులును హెచ్చరించారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా తోకావారిపాలెంలో ప్రచారం నిమిత్తం వెళ్లిన అభ్యర్థిని, టీడీపీ నేతలను స్థానిక ప్రజలు, వైఎస్సార్ సీపీ నేతలు నిలదీశారు. సూపర్ సిక్స్, సూపర్ టెన్ అంటూ మరోసారి అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేసేందుకు గ్రామాల్లోకి వస్తున్నారా? అంటూ నిలదీశారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న 14 సంవత్సరాల కాలంలో దళితులకు చేసిన న్యాయం ఏంటని ప్రశ్నించారు. దళితులపై ప్రేమ పేదలు, దళితులను ఆదుకుని సంక్షేమ పథకాలతో కుటుంబాల ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని చెప్పారు. సంక్షేమ పథకాలను ఇంటి వద్దకే అందించిన జగన్‌మోహన్‌రెడ్డికే తాము మద్దతు తెలుపుతామని గ్రామ ప్రజలు తెలిపారు. దీంతో ప్రచార కార్యక్రమాన్ని గ్రామ కూడలి వరకూ వెళ్లి అక్కడి నుంచి టీడీపీ నాయకులు వెనుదిరిగారు. దళితులపై ప్రేమ ఉంటే చంద్రబాబు దళితులు, పేదలకు ఏమి న్యాయం చేశాడో ఒక్కటైనా చెప్పాలని అభ్యర్థిని, టీడీపీ నేతలను ప్రజలు ప్రశ్నించారు.

పాల ప్యాకెట్‌కు వెళ్లి తిరిగిరాని లోకానికి..

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో పాలప్యాకెట్‌కు వెళ్లిన ఓ బాలుడు మృతి చెందాడు. వివరాలు.. పశ్చిమ గోదావరి జిల్లా, భీమడోలు మండలం, వెలపపేట గ్రామానికి చెందిన రామిశెట్టి వెంకటేష్ నాయుడు పెద్ద కుమారుడు రామిశెట్టి గౌతమ్‌నాయుడు(12) 6వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవులు రావడంతో తాడేపల్లి రూరల్ కొలనుకొండలోని తాతయ్య కృష్ణారావు ఇంటికి వచ్చాడు. బుధవారం ఉదయం పాలప్యాకెట్లు తీసుకురమ్మని తన ద్విచక్ర వాహనం ఇచ్చి బైపాస్ రోడ్‌లోని పాలబూత్‌కు పంపించారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ఎయిమ్స్ హాస్పిటల్ రోడ్‌లోకి వచ్చాడు. ఈ క్రమంలో ఎదురుగా వెళుతున్న క్రేన్‌ను క్రాస్ చేస్తూ అదుపుతప్పి క్రేన్ కింద పడడంతో అక్కడికక్కడే గౌతమ్ నాయుడు మృతి చెందాడు. జరిగిన ఘటనపై తండ్రి రామిశెట్టి వెంకటేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

ప్రలోభాలను అరికట్టేందుకు పటిష్ట చర్యలు

రాష్ట్ర ప్రత్యేక ఎన్నికల వ్యయ పరిశీలకులు ఎంఎస్ నీనానిగం



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు ఎంఎస్ నీనానిగం

బాపట్ల: ఓటర్లను ప్రలోభ పెట్టే మద్యం, నగదు, బహుమతుల పంపిణీని అధికారులు పూర్తిగా అరికట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రత్యేక వ్యయ పరిశీలకులు ఎంఎస్ నీనానిగం(విశ్రాంత ఐఆర్‌ఎస్ అధికారి) ఆదేశించారు. వ్యయ పర్యవేక్షణ కమిటీ, అనుబంధ విభాగాల అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో సమావేశం జరిగింది. అనంతరం మీడియా సెంటర్, వెబ్ క్యాస్టింగ్, సోషల్ మీడియా, వ్యయ కమిటీ, గ్రీవెన్స్ సెల్ విభాగాలను జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషాతో కలిసి ఎన్నికల పరిశీలకులు నీనానిగం పరిశీలించారు.

ప్రశాంత వాతావరణంలో సార్వత్రిక ఎన్నికలు జరిగేలా అధికారులు పనిచేయాలని నీనానిగం సూచించారు. ఎన్నికల సమయం ఉన్న 12 రోజులు కీలకంగా భావించాలని, నగదు చేతులు మారకుండా పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. అక్రమ రవాణా, తరలింపులను అరికట్టడానికి జిల్లా సరిహద్దుల్లో నియమించిన బృందాలు 24 గంటల పాటు పని చేయాలని సూచించారు. ఒక వ్యక్తి నుంచి పది మందికి యూపీఐ ద్వారా నగదు బదిలీ చేస్తే.. బ్యాంక్ అధికారుల సహకారంతో విచారించాలన్నారు. హోటల్స్, బార్‌లలో మద్యం విక్రయాలు అధికంగా నమోదైతే అలాంటి వాటిపై ప్రత్యేక దృష్టి సారించి, తనిఖీలు చేయాలని చెప్పారు. విక్రయాలు, బిల్లులు, నిల్వలను పరిశీలించాలని ఆదేశించారు. ఎన్నికల్లో సున్నితమైన అంశాలను సైతం పరిగణనలోకి తీసుకోవాలన్నారు.

పకడ్బందీగా అమలు..

ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థను పకడ్బందీగా అమలు చేస్తున్నామని జిల్లా ఎన్నికల అధికారి పి.రంజిత్ బాషా తెలిపారు. బాపట్ల జిల్లాలో ఏర్పాటు చేసిన వివిధ విభాగాల కంట్రోల్ రూమ్‌లు, ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ బృందాల పనితీరును పీపీటీ ద్వారా ఆయన వివరించారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో రూ.4.80కోట్ల మద్యం, ఆభరణాలు, నగదు, బహుమతులు, ప్రచార సామగ్రి ఇతర వస్తువులను సీజ్ చేశామని తెలిపారు. నోడల్ అధికారులు, ప్రత్యేక బృందాలు సమర్థంగా పనిచేస్తున్నాయని వివరించారు. ఎన్నికల నిర్వహణపై ముందస్తుగా తీసుకున్న చర్యలు, ఏర్పాట్లపై ఎన్నికల పరిశీలకులకు ఆయన నివేదిక అందించారు.

నియామావళి ఉల్లంఘనపై చర్యలు

ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనపై జిల్లాలోని పలు ప్రాంతాల్లో కేసులు నమోదు చేశామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. జాతీయ రహదారుల వెంట అక్రమంగా తరలిస్తున్న మద్యం, నగదు, మాదకద్రవ్యాలను పూర్తిస్థాయిలో అరికట్టామని పీపీటీ ద్వారా వివరించారు. గత ఎన్నికల అనుభవాల దష్ట్యా గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా పోలీస్ బలగాలను నియమించామని వెల్లడించారు. పోలీసులను బృందాలుగా ఏర్పాటు చేసి జిల్లాలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. ఈ సమావేశంలో ఎన్నికల పార్లమెంట్ నియోజకవర్గం వ్యయ పరిశీలకులు ఎస్.అరుణకుమార్, వ్యయ పరిశీలకులు స్వప్నిల్ సాహెబ్ రావు, కనహయ్య పద్దార్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, వ్యయ పర్యవేక్షణ కమిటీ జిల్లా నోడల్ అధికారి హరికృష్ణ పాల్గొన్నారు.

అభివృద్ధి చేశాం.. ఆశీర్వదించండి

వైఎస్సార్ సీపీ చీరాల అభ్యర్థి కరణం వెంకటేష్



నమూనా బ్యాలెట్ చూపిస్తూ ఓటు అభ్యర్థిస్తున్న కరణం వెంకటేష్



వైఎస్సార్ సీపీకి మద్దతిచ్చిన వారికి పార్టీ కండువాలు వేసిన అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్

చీరాల: నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేశామని, మరోసారి కరణం కుటుంబాన్ని గెలిపించాలని చీరాల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి కరణం వెంకటేష్ ప్రజలను అభ్యర్థించారు. బుధవారం చీరాల పట్టణంలోని 2, 3 వార్డుల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమానికి బృహత్తర పథకాలు అందించిన జగనన్నను మళ్లీ సీఎం అయితేనే అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగుతాయని పేర్కొన్నారు. గడిచిన ఐదేళ్లలో చీరాల నియోజకవర్గంలో అన్ని వర్గాల అభ్యున్నతికి, అభివృద్ధికి, సంక్షేమానికి అండగా నిలిచామన్నారు. గొప్ప పథకాలు అందించి, ప్రజల జీవన ప్రమాణాలు మార్చిన సీఎం జగనన్నకు అందరం అండగా నిలవాల్సిన సమయం వచ్చిందన్నారు. 2వ వార్డులో కోలా క్రాంతితో పాటు 30 కుటుంబాల వారు అభ్యర్థి కరణంను కలిసి తమ పూర్తి మద్దతును తెలిపారు. అసెంబ్లీ అభ్యర్థిగా తనను, పార్లమెంట్ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను ఫ్యాను గుర్తుపై ఓట్లేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ బి.జైసన్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, కోండ్రు ప్రతాప్, కంకణాల రంగయ్య, మాజీ వైస్ చైర్మన్ కొరబండి సురేష్, 3వ వార్డు కౌన్సిలర్ కె.యానాదిరావు, కంకణాల నాని, షేక్ సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

నీటికుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి

పెదకూరపాడు : మండల పరిధిలోని రామాపురంకు చెందిన ఇద్దరు చిన్నారులు నీటి గుంతలో పడి మృతి చెందిన సంఘటన బుధవారం రాత్రి 10 గంటల సమయంలో చోటు చేసుకుంది. రామాపురం గ్రామం ఎస్సీకాలనీకి చెందిన గొడ్డుగర్ల అభి (13), గొడ్డుగర్ల సందీప్ (13) ఇద్దరు గ్రామ శివారులో ఉన్న నీటి గుంతలో చేపలు పట్టేందుకు వెళ్లారు. గుంతలో దిగారు. ప్రమాదవశాత్తు నీటిగుంతలో చిక్కుకుపోయారు. రాత్రి 9 గంటల సమయంలో అభి తల్లిదండ్రులు కిషోర్, బుజ్జి, సందీప్ తల్లిదండ్రులు నాగేశ్వరరావు, మరియమ్మలు పిల్లలు ఇంటికి రాలేదని వెతుక్కుంటూ వెళ్లగా చెప్పులు, దుస్తులు నీటి గుంత బయట ఉండటం గమనించారు. స్థానికుల సహాయంతో నీటి గుంతలో దిగారు. ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

చెప్పిందే చేసిన జగనన్నకే ఓటేద్దాం

- కిచిడి మేనిఫెస్టోతో ప్రజల ముందుకు చంద్రబాబు
- పర్చూరు వైఎస్సార్ సీపీ అభ్యర్థి యడం బాలాజీ



దేగరమూడిలో ప్రజలకు బాలాజి అభివాదం

మార్టూరు: ఆచరణకు సాధ్యం కాని హామీల మేనిఫెస్టోతో చంద్రబాబు నాయుడు మరోసారి ప్రజలను మోసగించడానికి వస్తున్నారని వైఎస్సార్ సీపీ పర్చూరు అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని డేగరమూడి, జొన్నతాళి, చిమ్మిరిబండ గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు ఘన స్వాగతం పలికారు. డేగరమూడి ఆయలంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన బాలాజీ చిమ్మిరిబండ గ్రామంలో బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇదే కిచిడీ పార్టీల కూటమితో 2014లో మేనిఫెస్టో ప్రకటించి, అధికారంలోకి వచ్చాక వాటిని తుంగలో తొక్కింది నిజమా..? కాదా..? అని ప్రశ్నించారు. డ్వాక్రా మహిళలకు రుణ మాఫీ హామీ ఇచ్చి చంద్రబాబు మోసగిస్తే అధికారం చేపట్టిన జగనన్న ఐదేళ్లలో దశల వారీగా రుణ మాఫీ చేశారని గుర్తుచేశారు. వైఎస్సార్ సీపీ బాపట్ల ఎంపీ అభ్యర్థి నందిగం సురేష్, ఎమ్మెల్యేగా తనను సీలింగ్ ఫ్యాను గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని యడం బాలాజీ కోరారు. డేగరమూడి సర్పంచ్ జంపని అంజమ్మ, నాయకులు వీరయ్య చౌదరి, జంపని సుబ్బారావు, కత్తి కిషోర్, ప్రమోద్, చిమ్మిరిబండ సర్పంచ్ జంపని నాగవర్ధని, వీరయ్య చౌదరి, ఎంపీటీసీ నవమణి, వార్డు మెంబర్లు లావణ్య, ఆంజనేయులు, కరిముల్లా, మౌలాలి, రత్నరాజు, వీరాంజనేయులు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు సూపర్ సిక్స్‌తో మోసం

- అభివృద్ధి, సంక్షేమానికి మారుపేరు వైఎస్సార్ సీపీ
- ఎన్నికల ప్రచారంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు సురేష్, హనిమిరెడ్డి



ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీ సురేష్, పక్కన అద్దంకి అభ్యర్థి హనిమిరెడ్డి

సంతమాగులూరు(అద్దంకి): సూపర్ సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసి, మళ్లీ సీఎం కావాలని చంద్రబాబు భావిస్తున్నారని బాపట్ల ఎంపీ నందిగం సురేశ్ విమర్శించారు. గురువారం సంతమాగులూరు మండలంలోని కుందుర్రు గ్రామంలో అసెంబ్లీ అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డితో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమానికి మారుపేరు వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నారు. సూపర్ సిక్స్ వంటి అమలు చేయలేని పథకాలు ప్రకటించి, ప్రజలను మోసం చేయడం జగనన్నకు చేతకాదన్నారు. ఆయన చేసేదే చెప్తారని, చేయగలిగిందే ప్రకటిస్తారని స్పష్టం చేశారు. చంద్రబాబు ఒకసారి అబద్ధాలు చెప్పి ముఖ్యమంత్రి అయిన తర్వాత.. హామీలు నెరవేర్చకపోవడంతో వైఎస్ జగన్‌ను ప్రజలు నమ్మి అధికారం కట్టబెట్టారని గుర్తుచేశారు. ఎన్నికలు ఇంకెన్నోరోజులు లేవని, నాయకులు, కార్యకర్తలు అప్రమత్తంగా ఉండి ఓటర్లకు జరిగిన మేలును

ప్రతి వ్యక్తి హృదయంలో జగనన్న..

అసెంబ్లీ అభ్యర్థి హనిమిరెడ్డి మాట్లాడుతూ ప్రజారంజక పాలనతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి హృదయంలో గుడి కట్టుకుని ఉన్నాడన్నారు. ఆ గుడిని ఎవరూ పడేయలేరని స్పష్టం చేశారు. అంతమంచి పాలన అందించిన వ్యక్తిని గూడుపుఠాని కూటమికట్టి ఓడించాలని చూస్తున్నారని విమర్శించారు. ఎవరు ఎన్ని కూటములు కట్టినా అంతిమ విజయం వైఎస్సార్ సీపీదేనన్నారు. వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో అమలు చేయగలిగిన పథకాలనే సీఎం జగన్ ప్రకటించారనిచెప్పారు. ఏ మేనిఫెస్టో బాగుందో తేల్చుకుని ఓటేయాలని ప్రజలను కోరారు. అద్దంకిలో తనను, బాపట్లలో ఎంపీగా నందిగం సురేష్‌ను ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు.



స్థానికులతో ఎంపీ సురేష్ ఆత్మీయ పలకరింపు

ప్రతి ఓటు ఫ్యాను గుర్తుకు వేసే వరకు నిద్రపోవద్దు

అద్దంకి: ప్రతి ఓటు ఫ్యానుకు వేయించాలని, ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని బాపట్ల ఎంపీ నందిగం సురేష్ పిలుపునిచ్చారు. స్థానిక వైస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎన్నిలకు ఇంకెంతో సమయం లేదన్నారు. పోలింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ప్రతిపక్షం ప్రలోభాలకు తెరలేపే అవకాశం ఉన్నందున, ఎక్కడికక్కడ తిప్పికొట్టే విధంగా పనిచేయాలని కోరారు. వైఎస్సార్ సీపీకి ఓటు బ్యాంకు మెండుగా ఉందని.. దాన్ని సక్రమంగా ఈవీఎంలలో నిక్షిప్తం చేయించే వరకు ఎవరూ నిద్రపోవద్దని దిశానిర్దేశం చేశారు. మళ్లీ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని సీఎంను చేసుకోవాలని స్పష్టం చేశారు. అద్దంకి నుంచి పానెం చిన హనిమిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. చిన హనిమిరెడ్డి మాట్లాడుతూ నాయకుల మధ్య విభేదాలు పెట్టుకోవద్దన్నారు. వ్యక్తిగతంగా తన దగ్గరకు వచ్చిన వారి పనులు చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. పార్టీలో అందరికీ గుర్తింపునిస్తామని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ బాపట్ల ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, మండల అధ్యక్షుడు గుజ్జుల జగన్‌మోహన్ రెడ్డి, ఇస్తర్ల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మే 5లోగా దూరవిద్య సప్లిమెంటరీ ఫీజు చెల్లించాలి

జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (దూరవిద్య) ఆధ్వర్యంలో జూన్ నెలలో నిర్వహించనున్న ఇంటర్మీడియేట్, పదవ తరగతి దూరవిద్య సప్లిమెంటరీ పరీక్ష ఫీజును ఎటువంటి అపరాధ రుసుం లేకుండా మే నెల 5వతేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వర్లు, డిస్టెన్స్ ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ కె.ఎం.ఏ.హుస్సేన్ బుధవారం తెలిపారు. అపరాధ రుసుం రూ.25లతో మే 6వతేదీ వరకు, రూ.50లతో మే 8వతేదీ లోగా చెల్లించాలని వివరించారు. ఈ ఏడాది మార్చి నెలలో నిర్వహించిన దూరవిద్య పరీక్షలో ఫెయిల్ అయిన అభ్యాసకులు, ప్రత్యేక అనుమతితో ప్రవేశాలు పొందిన అభ్యాసకులు పరీక్ష ఫీజులు చెల్లించవచ్చని తెలిపారు. పల్నాడు జిల్లాలో 10వ తరగతిలో 959మంది, ఇంటర్మీడియట్‌లో 1420మంది అభ్యాసకులు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉందని వివరించారు. సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 1 నుంచి 8వతేదీ వరకు నిర్వహిస్తారని తెలిపారు. గత మార్చి నెలలో పాస్/ ఫెయిల్ అయిన అభ్యాసకులు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ నిమిత్తం మే నెల 7లోగా ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించాలని తెలిపారు. రీకౌంటింగ్‌కు ఒక సబ్జెక్టుకు రూ.200లు, రీవెరిఫికేషన్‌కు వెయ్యి రూపాయలు చొప్పున చెల్లించాలని వివరించారు.

టిప్పర్ ఇంటిపై పడి నిద్రిస్తున్న మహిళ మృతి

చిలకలూరిపేట టౌన్: అదుపు తప్పిన టిప్పర్ సమీపంలోని ఇంటిపై పడటంతో మహిళ మృతి చెందిన సంఘటన పట్టణం పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పోలిరెడ్డిపాలెం రోడ్డు ప్రక్క నివాసాల్లో ఉంటున్న అన్నపరెడ్డి నాగమ్మ(60) కంపెనీల్లో వచ్చే బేళ్లకు ఉపయోగించే వేస్ట్ ప్లాస్టిక్ వైర్లతో బుట్టల్ని తయారు చేసుకుంటూ జీవనం సాగిస్తుంది. బుధవారం తెల్లవారుజామున నరసరావుపేట వైపు నుంచి చిలకలూరిపేటకు వస్తున్న క్రమంలో టిప్పర్ లారీ అదుపుతప్పి నాగమ్మ నివసించే ఇంటింపై బోల్తాకొట్టింది. దీంతో ఇంట్లో నిద్రిస్తున్న నాగమ్మ సంఘటనా స్థలంలోనే మృతి చెందింది. భర్త పెద నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు చేసుకుని అర్బన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి ముగ్గురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు ఉన్నారు.

కారు రిపేరు చేస్తూ మీదపడి యువకుడి మృతి

పెదకూరపాడు: కారు రిపేరు చేస్తుండగా జాకీ స్లిప్ కావడంతో యువకుడు మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా పెదకూరపాడు మండలంలోని 75త్యాళ్లూరులో చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన గుత్తికొండ భూపతిరెడ్డి (32) వ్యవసాయంతో పాటు ట్రావెల్స్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు తండ్రి గుత్తికొండ నాగిరెడ్డి రిటైడ్ ఆర్మీ కావడంతో తండ్రికి సాయంగా ఉంటున్నాడు. గతవారం రోజుల క్రితం ట్రావెల్స్‌కు ఉపయోగించే మహీంద్రా లోగోస్ కారు రిపేరు వచ్చింది. భూపతిరెడ్డి బాబాయ్ కుమారుడు వివాహం ఉండటంతో కారు రిపేరు చేసేందుకు కుదరలేదు. పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు. వివాహం అనంతరం బుధవారం కారు రిపేరు చేసేందుకు డ్రైవర్ నాగూరుతో కలసి కారును జాకీ సాయంతో రిపేరు చేస్తుండగా రిపేరుకు అవసరమైన రెంచీలు తీసుకువచ్చేందుకు డ్రైవర్ వెళ్లగా కారు కింద భాగంలో ఉండి మరమ్మతులు చేస్తున్న భూపతి రెడ్డి పై జాకీ స్లిప్ కావడంతో కారు నుదురుపై పడడంతో అక్కడిక్కడే మృతి చెందారు. రెంచీలు తీసుకు వచ్చిన డ్రైవర్ నాగూరు కారు కింద ఉన్న భూపతిరెడ్డిని చూసి కేకలు వేయడంతో స్థానికులు కారును లేపి చూడగా అప్పటికే మృతిచెందాడు. భూపతిరెడ్డి తెలంగాణలో నైజాంకు చెందిన అమనిని ప్రేమించి వివాహం చేసుకున్నాడు.

ఎమ్మెల్యే శంకరరావు నివాళులు : ప్రమాదంలో మృతి చెందిన భూపతిరెడ్డి మృతదేహాన్ని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పరామర్శించి నివాళ్లు అర్పించారు. తండ్రి నాగిరెడ్డిని ఓదార్చరు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ప్రజా సంక్షేమం లక్ష్యంగా మేనిఫెస్టో

రేపల్లె వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్



తూర్పుపాలెంలో డాక్టర్ ఈవూరి గణేష్ ఎన్నికల ప్రచారం

చెరుకుపల్లి: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టో ప్రకటించారని రెపల్లె నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. మండలంలోని తూర్పుపాలెం గ్రామంలో ఎంపీపీ మత్తి దివాకర రత్న ప్రసాద్, స్థానిక సర్పంచ్ తూము రమాదేవి ఆధ్వర్యంలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ ప్రకటించిన వైఎస్సార్ సీపీ మేనిఫెస్టోలో మహిళలకు వరాల జల్లు కురిపించారన్నారు. తెలుగుదేశం పార్టీ తప్పుడు హామీలను ప్రజలు గమనిస్తున్నారన్నారు. జగనన్న ముఖ్యమంత్రిని చేసుకునేందుకు.. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి, ఎమ్మెల్యేగా తనను, బాపట్ల ఎంపీగా నందిగం సురేష్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. జెడ్పీటీసీ సభ్యురాలు మరివాడ వెంకట పావని పద్మశాలీయులతో కలసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలుపును కాంక్షిస్తూ గుళ్ళపల్లిలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ కేశవతి, సృజన్, వైఎస్సార్ సీపీ నాయకులు తూము కోటేశ్వరరావు, శివసుబ్రహ్మణం, భాస్కరావు, శ్రీకాంత్, కొతరపు గణేష్, వంగరు భాను, కొతరపు ఉదయ్ శంకర్, తిరుమలరావు, పడవల మల్లికార్జునరావు, అందే శ్రీనివాసరావు నాయకులు పాల్గొన్నారు.

బూటకపు హామీల చంద్రబాబు మనకొద్దు

ఎన్నికల పరిశీలకుడు తూమాటి, డీసీఎంస్ మాజీ చైర్మన్ రామనాథంబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మాధవరావు, రామనాథంబాబు

మార్టూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సంక్షేమ బాట పట్టించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని ఎమ్మెల్సీ, పర్చూరు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు తూమాటి మాధవరావు పిలుపునిచ్చారు. మండలంలోని ద్రోణాదుల గ్రామంలో బుధవారం రాత్రి డీసీఎంస్ మాజీ చైర్మన్ రామనాథంబాబుతో కలిసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రామనాథంబాబు మాట్లాడుతూ ఆచరణకు సాధ్యం కాని హామీలతో చంద్రబాబు విడుదల చేసిన మేనిఫెస్టోను నమ్మొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. జన్మభూమి కమిటీలతో టీడీపీ పాలనలో జరిగిన అరాచకాన్ని ప్రజలు మర్చిపోలేదన్నారు. ఈ నెల 13న నిర్వహించనున్న ఎన్నికల్లో పర్చూరు ఎమ్మెల్యే అభ్యర్థిగా యడం బాలాజీని, బాపట్ల ఎంపీ అభ్యర్థిగా నందిగం సురేష్‌ను సీలింగ్ ఫ్యాను గుర్తుపై రెండు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మాధవరావు ద్రోణాదుల గ్రామస్తులను కోరారు. రాష్ట్ర డైరెక్టర్ యద్దనపూడి హరిప్రసాద్, సర్పంచ్ వి.భాగ్యారావు, ఎంపీటీసీలు పెంటేల సురేష్ గాలి ఏసోబు, సీనియరు నాయకులు సత్యనారాయణ, మాగులూరి రాధ, గద్దం మస్తాన్ వలి పాల్గొన్నారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గంలో ఓ రాజకీయ పార్టీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న 140వ సచివాలయానికి చెందిన అవుట్‌సోర్సింగ్ కార్మికురాలు జి.లక్ష్మిని విధుల నుంచి తొలగిస్తూ తూర్పు ఆర్‌ఓ కీర్తి చేకూరి బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ఎన్నికల ప్రచారంలో నగరపాలక సంస్థ ఉద్యోగులు ఎవరు పాల్గొన్నా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

టీడీపీ ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్



నగరం: మండలంలోని అల్లపర్రుకు చెందిన సత్యనారయణ ఎండీయూ ఆపరేటర్. అల్లపర్రు, కట్టవ, మంత్రిపాలెం గ్రామాల్లో రేషన్ బియ్యం, సరుకులు పంపిణీ చేస్తున్న ఇతను టీడీపీ తరపున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ.. ప్రవర్తన నియమావళిని ఉల్లఘించాడు. అతనిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై తహసీల్దారు శ్రీశిల్పను వివరణ కోరగా సత్యనారయణ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నట్లు తన దృష్టికి వచ్చిందని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు.

రజినమ్మ గెలుపు కోసం కృషి



తెనాలి: రాష్ట్రంలోని బీసీలు, మహిళలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే ఉన్నారని తెనాలి మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ డాక్టర్ తాడిబోయిన మస్తానమ్మ అన్నారు. బీసీ మహిళా మంత్రి, గుంటూరు పశ్చిమ అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థిని విడదల రజినీని ఆమె తన కుమారులు డాక్టర్ అవినాష్, డాక్టర్ అఖిలేష్‌తో సహా బుధవారం గుంటూరులో కలిసి మద్దతు ప్రకటించారు. రాష్ట్రంలో తొలిసారిగా బీసీలను రాజ్య సభకు ఎన్నిక చేసింది వైఎస్సార్ సీపీ మాత్రమేనని డాక్టర్ మస్తానమ్మ గుర్తు చేశారు. ప్రస్తుత ఎన్నికల్లో బీసీలకు 50 మందికి ఎమ్మెల్యే టిక్కెట్లను కేటాయించారని, తొలిసారిగా ఇద్దరు యాదవులను లోక్ సభకు, నలుగురు యాదవులను అసెంబ్లీ బరిలో నిలిపింది కూడా జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని అభినందించారు. అదేవిధంగా గుంటూరు పార్లమెంటు పరిధిలో నలుగురు మహిళలు అందులోనూ ఇద్దరు బీసీలు, ఒక ఎస్సీ, ఒక మైనారిటీని ఎంపిక చేసిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని చెప్పారు. నేతలు తాడిబోయిన బుచ్చిరాజు, రామయ్య ఉన్నారు.

పొన్నెకల్లులో రూ.50,660 నగదు స్వాధీనం

తాడికొండ: మండలంలోని పొన్నెకల్లు గ్రామ పరిధిలో రూ.50,660 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ బుధవారం తెలిపారు. మేడికొండూరు మండలం మందపాడు గ్రామానికి చెందిన తెలగతోటి స్వర్ణ అనే మహిళ ద్విచక్ర వాహనంపై పొన్నెకల్లు వైపు వెళ్తుండగా.. ఫ్లెయింగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీ చేశారు. ఎలాంటి రసీదులు, ఆధారాలు తీసుకెళ్తున్న నగదును స్వాధీనం చేసుకొని, ఐటీ అధికారులకు అప్పగించినట్లు సీఐ ప్రభాకర్ తెలిపారు.

ఇక మీరే కీలకం.. నిష్పక్షపాతం లక్ష్యం

- ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్



రేపల్లె రూరల్: ఎన్నికల విధుల్లో పోలింగ్ అధికారులు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు నిష్పక్షపాతంగా తమ విధులు నిర్వర్తించాలని రేపల్లె ఎన్నికల రిటర్నింగ్ అధికారి హెలా షారోన్ స్పష్టం చేశారు. ఎన్నికల విధులపై మండలంలోని పేటేరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం పీఓలు, ఏపీవోలతో రెండవ విడత నిర్వహించిన శిక్షణ తరగతులలో ఆమె పాల్గొని, మాట్లాడారు. ఎన్నికల సరళిలో పీవో, ఏపీవోలవే కీలక బాధ్యతలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినిగించుకునేలా చూడాలని ఆదేశించారు. ఓటరు గుర్తింపు కార్డులను నిశితంగా పరిశీలించి, దొంగ ఓట్లు అరికట్టంలో సమర్థంగా పనిచేయాలని చెప్పారు. పోలింగ్ రోజున పోలింగ్ కేంద్రాల్లోకి ఆయా పార్టీల నుంచి గుర్తింపు పొందిన ఏజెంట్లను మాత్రమే అనుమతించాలని నిర్దేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు చొప్పా రవీంద్ర, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

ఊర్లోనే వ్యవసాయం

- సబ్సిడీ, నాన్ సబ్సిడీతో విత్తనాలు సరఫరా
- ఎమ్మార్పీకే ఎరువులు, పురుగు మందులు
- రాయితీపై వ్యవసాయ పరికరాలు
- పంట నమోదుతో ఉత్పతులకు మద్దతు ధర
- 'సత్తెనపల్లి'లో ఊరూరా రైతు భరోసా కేంద్రాలు
- 54 రైతుభరోసా కేంద్రాలకు రూ.11.86 కోట్లు మంజూరు
- డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద రూ.255.30 కోట్లు

ఇది కదా.. అభివృద్ధి



రైతులకు సబ్సిడీ విత్తనాలు పంపిణీ చేస్తున్న జేసీ శ్యాంప్రసాద్(ఫైల్)



ధూళిపాళ్లలోని రైతు భరోసా కేంద్ర భవనం

సత్తెనపల్లి: వ్యవసాయం దండగ అన్న టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడి పాలన చూశాం. వ్యవసాయం అంటేనే పండగ అనేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా చూశాం. ఊర్లోనే వ్యవసాయానికి అవసరమైన సాయం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించింది. రైతు సంక్షేమానికి రైతు భరోసా కేంద్రాలను తీసుకొచ్చింది. ప్రతి సచివాలయానికి అనుబంధంగా వాటిని ఏర్పాటు చేసింది. ఆర్బీకేల్లోనే సబ్సిడీ, నాన్ సబ్సిడీతో విత్తనాలు, ఎమ్మార్పీ ధరలకే ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నారు. కౌలు రైతులకు పంట సాగు పత్రాలు కూడా ఇక్కడే జారీ చేస్తున్నారు. ఈ–క్రాప్ నమోదుతో పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పిస్తున్నారు.

'రైతు భరోసా' ప్రభుత్వం ఇది

..డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద ఒక్కో రైతులకు ఏడాదికి రూ.13,500 చొప్పున నగదు సాయం అందిస్తోంది ప్రభుత్వం. గడిచిన ఐదేళ్లలో సత్తెనపల్లి నియోజకవర్గంలో 1,94,257 మంది రైతులకు రూ.255.30కోట్లు సాయం అందించింది. నియోజకవర్గంలోని సత్తెనపల్లి, ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాలున్నాయి. ఒక్కో ఆర్బీకే భవన నిర్మాణానికి రూ.21.97 లక్షల చొప్పున మొత్తం 54 భవనాలనకు రూ.11,86,38,000 నిధులు మంజూరయ్యాయి. వీటిలో 34 భవన నిర్మాణాలు పూర్తయ్యి.. రైతులకు సేవలందిస్తుండగా మరో 20 భవనాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి.

సాగు విజ్ఞానం కోసం..

..రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు సంబంధించి లైబ్రరీ ఉంటుంది. ఇందులో పత్తి, వరి, మిరప ఇతర పంటలకు సంబంధించి శాస్త్రవేత్తలు, వ్యవసాయ నిపుణులు అందించే సాగు సూచనలు, సలహాల పుస్తకాలు ఉంటాయి. రైతులు ఖాళీ సమయాల్లో వీటిని చదువి వ్యవసాయంలో మెళకువల పాటించవచ్చు. అక్కడే ఉండే టీవీలో పెన్ డ్రైవ్ ద్వారా సాగు విధానాలు, ఎరువుల యాజమాన్యంపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రసారం చేస్తారు. కొంతకాలం క్రితం నియోజకవర్గంలో భూసార పరీక్షలు చేశారు. నేలలో పోషక విలువలు ఎంత శాతం ఉన్నాయో తెలుసుకునేందుకు ఇవి ఉపయోగపడతాయి. నేలలో ఆమ్ల తత్వం, క్షారతత్వం ఉందో లేదో తెలుసుకోవచ్చు. నేల సామర్థ్యాన్ని బట్టి ఏ పంటకు.. ఎలాంటి ఎరువులు వాడాలో తెలిసిపోతుంది.

మరికొన్ని సేవలు..

..పంట నమోదుతో బ్యాంకులకు వెళ్లకుండా, రుణాలు తీసుకోకుండా రైతులకు ఉచిత పంటల బీమా అమలు చేస్తారు. ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుండడంతో ఈ–క్రాప్ బుకింగ్ అయితే పంట బీమాకు అర్హత వస్తుంది.

- అతివృష్టి, అనావృష్టి సంభవించినప్పుడు పంట నష్టంపై సర్వే చేసి, రైతులకు నిర్దిష్ట గడువులోపే పరిహారం వచ్చేలా చర్యలు తీసుకుంటున్నారు.
- వ్యవసాయ అనుబంధ శాఖలకు సంబంధించి డ్రిప్, స్ప్రింక్లర్లు, పవర్ స్ప్రేయర్లు, పశువులకు దాణా, గడ్డి విత్తనాలు తదితర ఏం కావాలన్నా రైతు భరోసా కేంద్రాల ద్వారానే ఆర్డర్ పెట్టుకోవచ్చు. రైతులకు అవసరమైతే నాన్ సబ్సిడీ కింద అవసరమైన రుణాలు కూడా రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించే వెసులుబాటు ఉంది.
- పంటలకు మద్దతు ధర లేనప్పుడు..కనీస మద్దతు ధరతో రైతు పండించిన వివిధ ఉత్పత్తులను రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేస్తారు.
- రైతు భరోసా కేంద్రాల ఉద్యోగులు సెలవు పై వెళ్ళిన పక్షంలో రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆ రోజుల్లో వలంటీర్ లేదా మరో సచివాలయ ఉద్యోగికి బాధ్యతలు అప్పగిస్తున్నారు.

గడిచిన ఐదేళ్ళలో డాక్టర్ వైఎస్సార్ రైతుభరోసా,పీఎం కిసాన్ ఇలా...

సంవత్సరం	రైతులు	డాక్టర్ వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్
2019–20	38,263	రూ.51.66 కోట్లు
2020–21	39,560	రూ.53.41 కోట్లు
2021–22	37,891	రూ.51.15 కోట్లు
2022–23	37,412	రూ.52.94 కోట్లు
2023–24	41,131	రూ.46.14 కోట్లు

గిరిజన బాంధవుడు వైఎస్ జగన్



తెనాలి: నవరత్నాల సంక్షేమ పథకాలతో గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపటమే కాకుండా వారికి ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అగ్ర తాంబూలమిచ్చి సమాజంలో గౌరవాన్ని పెంపొందించిన గిరిజన బాంధవుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కార్పొరేషన్(ట్రైకార్) చైర్మన్ గుండా సురేంద్ర అన్నారు. వైఎస్సార్ సీపీ గుంటూరు ఎంపీ, తెనాలి ఎమ్మెల్యే అభ్యర్థులు కిలారి వెంకట రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్ విజయాన్ని కాంక్షిస్తూ పట్టణంలోని 3, 16, 17, 23 వార్డుల్లోని ఎస్టీ వర్గాల్లో బుధవారం విస్తృతంగా ప్రచారం చేశారు. ఉప ముఖ్యమంత్రి పదవి, టీటీడీతో సహా దేవస్థానాల్లో డైరెక్టర్ పదవులు కల్పించారని చెప్పారు. 58 నెలల పాలన కాలంలో రూ.19,125 కోట్లు వ్యయం చేశారని, చంద్రబాబు కన్నా మూడురెట్లు ఎక్కువగా ఆర్థికంగా సాయపడ్డారని వెల్లడించారు. ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కట్టా బుల్లియ్య, గిరిజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవరకొండ శంకరరావు, ఏపీ ఎరుకల ప్రజా సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గరిక శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు సాంబశివరావు, దేవరకొండ గజేంద్రరావు, నాంచారయ్య, కాళిదాసు సత్యనారాయణ, కృష్ణ, స్టేట్ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి రవికుమార్, వైద్య విభాగం రాష్ట్ర కార్యదర్శి నరేష్, శ్రీనివాసరావు, శ్రీను పాల్గొన్నారు.



కార్యకర్తల కోరిక మేరకు బుల్లెట్ నడుపుతున్న బలసాని







భవిష్యత్తు బాగుండాలంటే..జగనన్న మళ్లీ సీఎం కావాలి: ఎన్నికల ప్రచారంలో చిన్నారులను ఎత్తుకున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు అశోక్‌బాబు, సుచరిత, యడం బాలాజీ

ప్రచార పర్వం

ఎన్నికలప్పుడే బాబుకు బీసీలు గుర్తొస్తారు

- అధికారంలోకి వచ్చాక కాళ్ల కింద చెప్పులా చూస్తారు
- రానున్న ఎన్నికల్లో బీసీలంతా కలసి చంద్రబాబును మట్టి కరిపించాలి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు గూడూరు నాని
- బీసీలను ఏనాడూ పట్టించుకోని టీడీపీ : బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఇంటూరి బాజ్జీ నందా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంఘ నాయకులు

నెహ్రూనగర్: తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడికి ఎన్నికల సమయంలో మాత్రమే బలహీనవర్గాలు గుర్తొకొస్తారని, అధికార పీఠంపై కూర్చున్నాక బీసీలను కాళ్ల కింద చెప్పుల్లా చూస్తారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గూడూరు నాని ముదిరాజ్ పేర్కొన్నారు. గుంటూరు చంద్రమౌళి నగర్ సాయిబాబా రోడ్డు వద్ద ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు సీఎంగా ఉండగా నాయీ బ్రాహ్మణులు సచివాలయంలో కలిస్తే తోకలు కట్ చేస్తా అన్నాడని, బీసీలు జడ్జిలుగా పనికిరారని లేఖ రాశాడని, ఇటువంటి నీచ బుద్ధి గల చంద్రబాబు ఎన్నికలు రాగానే మళ్లీ బీసీ జపం చేస్తున్నాడని, ఆ కొంగ జపాలను బీసీలు నమ్మరని స్పష్టం చేశారు. మేనిఫెస్టోను అమలు చేయకుండా చివరకు వెబ్‌సైట్ నుంచి తొలగించిన దొంగ, మోసకారి చంద్రబాబు అని అన్నారు. సీఎం జగన్ మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంలా భావించి, ఆచరణలో అమలు చేసి చూపించారన్నారు. పాదయాత్రలో బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించి, అధికారంలోకి రాగానే ఆచరించి చూపించారన్నారు. రాష్ట్రంలో 56 శాతం ఉన్న బీసీలందరూ రానున్న ఎన్నికల్లో చంద్రబాబును మట్టి కరిపించి, వైఎస్ జగన్‌ను మళ్లీ అధికార పీఠం మీద కూర్చోబెడతారని అన్నారు.

బాబు మాటలు ఎవరూ నమ్మరు..

బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ ఇంటూరి బాజ్జీ నందా మాట్లాడుతూ 2014 మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ చంద్రబాబు బుట్టదాఖలు చేసి, ఇప్పుడు మళ్లీ బూటకపు హామీలిచ్చి మోసపుచ్చడానికి యత్నిస్తున్నారని అన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలబడతారని అన్నారు. గుంటూరు నగర బీసీ నాయకురాలు, 34వ డివిజన్ కార్పొరేటర్ బూసి రాజలత, గుంటూరు నగర రజక సంఘం అధ్యక్షుడు పోకల వసంతకుమార్, కుమ్మరి యువసేన అధ్యక్షుడు లలిత్ ప్రజాపతి, గుంటూరు జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి సున్నం మల్లికార్జునరావు, బీసీ నాయకులు మాధవ్ యాదవ్, రవికుమార్, దరియా, రోజా, వక్కా రాణి, దుర్గమ్మ పాల్గొని మాట్లాడారు.

వైఎస్సార్ సీపీకి ఆంధ్రా ఎమ్మార్పీఎస్, మజ్లిస్ పార్టీలు మద్దతు



మజ్లిస్ నాయకులతో కలిసి కరపత్రం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: వైఎస్సార్ సీపీకి మజ్లిస్, ఆంధ్రా ఎమ్మార్పీఎస్, అంబేడ్కర్ ఆశయ సాధన సమితి మద్దతు ప్రకటించాయి. స్థానిక ప్రకాష్ నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఆ పార్టీల నాయకులు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సమక్షంలో వేర్వేరుగా తమ మద్దతును ప్రకటించారు. మజ్లీస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే గోపిరెడ్డి కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఆంధ్రా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు కాల్వ రవి మాదిగ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అన్నీ జిల్లాల్లోని తమ పార్టీ వర్గీయులు భేషరత్‌గా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, వైఎస్సార్ సీపీతో కలిసి ఎన్నికల్లో పాల్గొంటారన్నారు. కరెన్సీ అంబేడ్కర్ చిత్రాన్ని ముద్రించాలనేది తమ లక్ష్యమని, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి తమకు మద్దతు ప్రకటించారన్నారు. మద్దతు కోసం నారాలోకేష్‌ను కలిస్తే సీఎం జగన్‌ను తిట్టాలని తమను కోరాడే కానీ, అతని నుంచి మద్దతు మాత్రం లభించలేదన్నారు. జనసేన పవన్ కల్యాణ్‌ను కలిసేందుకు నాలుగేళ్ల నుంచి ప్రయత్నాలు చేస్తున్నా.. అవకాశం ఇవ్వలేదన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి సహకారంతో ఇప్పటికి నాలుగుసార్లు సీఎం జగన్‌ను కలిశామన్నారు. మజ్లీస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ కరిముల్లా మాట్లాడుతూ 2014లో అనుభవం ఉన్నవాడని అందరూ చంద్రబాబుకు మద్దతు ఇస్తే.. బీజేపీతో కలిసి ముస్లింలను అణగదొక్కేందుకు ఎన్‌ఆర్‌సీ ఎంపీఆర్‌ను అమలు చేశారన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు షేక్ మౌలాలి, ఉపాధ్యక్షుడు రియాజ్, కార్యదర్శి ఆరీఫ్ మసూద్, వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ ఖాదర్ బాషా, పాదిలే

తుమ్మకోట..అభివృద్ధి బాట

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మారిన గ్రామ రూపురేఖలు



తుమ్మకోట ఆర్బీకే



తుమ్మకోట వైఎస్సార్ విలేజ హెల్త్ క్లినిక్



రూ.30లక్షలతో నిర్మించిన షాదీఖానా

ఇది కదా.. అభివృద్ధి



ఎస్సీ కాలనీలో వేసిన సీసీ రోడ్డు

తుమ్మకోట(రెంటచింతల): మండలంలోని చారిత్రక నేపథ్యం గల గ్రామం తుమ్మకోట. మొగల్ సామ్రాజ్యం 6వ, చివరి చక్రవర్తి ఔరంగజేబు పాలనలో (1658–1707) గ్రామంలో నిర్మించిన మజీద్ ఈ అలంగీర్ ఇప్పటికీ ఉంది. 6,028మంది జనాభా, 4,276 మంది ఓటర్లు ఉన్న తుమ్మకోట గ్రామ చరిత్రలో నిలిచిపోయే విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టింది. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన దక్షత, స్థానిక మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి సహకారంతో గ్రామ రూపురేఖలే మారిపోయాయి.

- 261 మంది పేదలకు ఇళ్ల పట్టాలు అందచేశారు.
- రూ. 1.20 కోట్లతో సీసీ రోడ్లు ఏర్పాటు.
- రూ. 21.80 లక్షలతో రైతుభరోసా కేంద్ర భవనం నిర్మాణం.
- రూ. 20.80 లక్షలతో వైఎస్సార్ హెల్త్ సెంటర్ ఏర్పాటు.
- రూ. 1.25 కోట్లతో స్థానిక జెడ్పీ హైస్కూల్ అభివృద్ధి.
- రూ. 30 లక్షలతో ముస్లిం సోదరులకు షాదీఖానా నిర్మాణం.
- రూ. 28 లక్షలతో మంచినీటి పైపులైన్ నిర్మాణ పనులు.
- రూ. 24 లక్షలతో మంచినీటి బోర్లు, మోటర్లు ఏర్పాటు.
- రూ. 1.17 కోట్లు రైతులకు క్రాప్ ఇన్సూరెన్స్ అందచేత.
- రూ. 2,73,01,584లు డ్వాక్రా మహిళలకు 4 విడతలుగా ఆసరా కింద అందచేత.
- రూ. 57,75,000లు 308 మంది లబ్ధిదారులకు వైఎస్సార్ చేయుత అందచేత.

అభివృద్ధికి చిరునామా



వైఎస్ జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కోట్ల రూపాయలతో చేపట్టిన పనులతో తుమ్మకోట గ్రామం అభివృద్ధికి చిరునామాగా నిలిచింది. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు పరుగులు తీశాయి. సంక్షేమ పథకాలతో గ్రామ ప్రజలకు ఆర్థిక దన్నుగా నిలిచాయి.

– మేకల మల్లయ్య, సొసైటీ అధ్యక్షుడు.

గ్రామంలోనే సమస్యలకు పరిష్కారం



గ్రామంలో సచివాలయం, ఆర్బీకేతో గ్రామంలోనే సమస్యలన్నీ పరిష్కారమవుతున్నాయి. విలేజ హెల్త్ క్లినిక్‌తో వైద్యానికి పరుగులు తీయాల్సిన పనిలేకుండా పోయింది. గత ప్రభుత్వంలో ఏ చిన్న పని జరగాలన్నా కాలయాపన జరిగేది. ఇప్పుడు ఆ సమస్య లేదు. కనివినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసింది వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.

– షేక్ జానీ బాషా, ఎంపీటీసీ.

రూపురేఖలు మార్చేశారు

నాకు 68 సంవత్సరాలు. మా కాలనీలో రోడ్ల దుస్థితిని ఇంత వరకు ఎవరూ మార్చలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇక్కడ సీసీ రోడ్లు అభివృద్ధి చేశారు. దీంతో కాలనీ రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. సంక్షేమ పథకాల ద్వారా ఎంతో మేలు జరిగింది.

– రెంటపాళ్ల ఏసమ్మ, ఎస్సీ కాలనీ.

లావణ్య విజయానికి సహకరించండి

సగర నాయీ బ్రాహ్మణ సంఘ నేతలతో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు భేటీ

మంగళగిరి: నగరంలోని సగర, నాయీ బ్రాహ్మణ సంఘం నేతలతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు బుధవారం భేటీ అయ్యారు. తొలుత పాత మంగళగిరి మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద గండికోట అచ్చయ్య, పందేటి సాంబశివరావులతో పాటు పట్టణ సగర సంఘ నాయకులను కలసి రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థిని మురుగుడు లావణ్య విజయానికి తమ వంతు సహకరించాలని కోరారు. తమకు కమ్యూనిటీ హాలు నిర్మించినందుకు సగర సంఘ నాయకులు ఎమ్మెల్యే ఆర్కేకు ధన్యవాదాలు తెలిపారు. బీసీ మహిళ మురుగుడు లావణ్యకు మంగళగిరి ఎమ్మెల్యే సీటును కేటాయించడం చాలా ఆనందంగా ఉందని, తమ సంఘ సహాయ సహకారాలు లావణ్యకు ఉంటాయని హామీ ఇచ్చారు. అనంతరం నగరంలోని పాత మంగళగిరిలో పట్టణ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు ఆకునూరి ఉమా మహేశ్వరరావు, మున్నంగి చలపతిరావులతో పాటు పలువురు నాయి బ్రాహ్మణ సంఘ నేతలతో ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావులు భేటీయై, మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి లావణ్య విజయానికి సహకరించాలని కోరారు. తాత, తండ్రుల నుంచి మురుగుడు కుటుంబంతో తమకు పరిచయాలు ఉన్నాయని, లావణ్య గెలుపునకు కృషి చేస్తామన్నారు.